# జన్నారం రోడ్లపై మృత్యుపాశాలు

- నడిరోడ్డుపైనే తిష్టవేస్తున్న వందలాది పశువులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

తుడుం జితేందర్
జనం పవర్, ఉత్తర తెలంగాణ బ్యూరో

జన్నారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఇప్పుడు సామాన్యుడి పాలిట మృత్యుపాశంగా మారుతోంది. గత కొన్ని నెలలుగా ఈ ప్రాంతంలో రోడ్లు ఆవుల సొత్తుగా మారగా, ప్రమాదాలు ప్రజల నుదుటి రాతగా తయారయ్యాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా వందలాది పశువులు నడిరోడ్డుపైనే తిష్టవేసి సేదతీరుతుండటంతో వాహనదారులు కత్తిమీద సాములా ప్రయాణం చేయాల్సి వస్తోంది.

## ప్రమాదకరంగా ఆవుల అడ్డా

సాధారణంగా వాహనాలు వెళ్లాల్సిన రహదారిపై ఇప్పుడు ఆవులు రాజ్యమేలుతున్నాయి. పశువులు ఒకదానితో ఒకటి పోట్లాడుకుంటూ అకస్మాత్తుగా రోడ్డుపైకి దూసుకురావడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్డుపై పడుకున్న పశువులు వాహనదారులకు కనిపించక వాటిని ఢీకొట్టి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రధాన కూడళ్లలో పదుల సంఖ్యలో ఆవులు తిష్టవేయడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది.

## అధికారులు స్పందించాలి

నెలల తరబడి ఈ సమస్య ప్రజలను పీడిస్తున్నా స్థానిక యంత్రాంగం పట్టించుకోకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై తిరిగే పశువులను గుర్తించి వాటిని గోశాలలకు తరలించాలని కోరుతున్నారు. పశువులను రోడ్లపై వదిలేస్తున్న యజమానులకు జరిమానాలు విధించాలని, రాత్రి వేళల్లో ప్రమాదాలను అరికట్టేందుకు పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అంటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జన్నారం మండల ప్రజల ప్రయాణాన్ని సురక్షితం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



# జన్నారంలో ఉచిత చలివేంద్రం ప్రారంభం



- ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- సర్పంచ్ సుష్మ భూమేష్ చొరవతో తాగునీటి వసతి ఏర్పాటు




తుడుం జితేందర్, జనం పవర్, ఉత్తర తెలంగాణ బ్యూరో

ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు జన్నారం మండల కేంద్రమైన పొన్కల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ఉచిత చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గురువారం ఘనంగా ప్రారంభించారు. సామాజిక బాధ్యతతో సర్పంచ్ చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో మందికి ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

## సేవా దృక్పథం హర్షణీయం

ఎండలు మండుతున్న వేళ బాటసారుల కష్టాలను గుర్తించి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ప్రజల అవసరాలకు తక్షణమే స్పందించే వారే నిజమైన ప్రజా ప్రతినిధులని ఆయన కొనియాడారు. ఈ సేవా కార్యక్రమం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ఇదే వేదికపై విద్యారంగంలో రాణిస్తున్న వారిని ఎమ్మెల్యే గౌరవించారు. జన్నారం మండలంలోని అక్కపల్లిగూడ ప్రాథమిక పాఠశాల ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకున్న సందర్భంగా అక్కడి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. గ్రామానికి పేరు తెచ్చినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు.

## సర్పంచ్ పై ప్రశంసల జల్లు

ముందస్తుగా స్పందించి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకున్న సర్పంచ్ సుష్మ భూమేష్‌పై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివిధ పార్టీల నాయకులు, మేధావులు ఆమె చొరవను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



జనం పవర్
JANAM POWER

శుక్రవారం
10 ఏప్రిల్ 2026

# రేషన్ బియ్యం అక్రమ తరలింపు

**అడ్డుకున్న విలేకరులపై బూతులతో బెదిరింపులు**

**చోద్యం చూస్తున్న మందమర్రి మండల అధికారులు**




**వేల్పుల నగేష్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మందమర్రి మండలం ఆదిల్‌పేట గ్రామంలో పేదల ఆకలి తీర్చే బియ్యం పక్కదారి పడుతోంది. ప్రతి నెల సుమారు 6 నుంచి 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దుకాణం నుంచి నేరుగా అక్రమంగా తరలిస్తున్నారు. టి ఎస్ 19 టి ఏ 6188 నెంబర్ గల ఆటోలో రాజు, సంధ్య అనే అక్కాతమ్ముళ్లు కలిసి ఈ దందాను సాగిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారుల అండదండలు ఉండటం వల్లే పేదలకు అందాల్సిన బియ్యం అక్రమార్కుల పాలవుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పాత్రికేయులపై దుర్భాష**

నమ్మదగిన సమాచారంతో ఈ అక్రమ తరలింపును కవరేజ్ చేసేందుకు వెళ్లిన విలేకరులను సదరు వ్యక్తులు తీవ్రంగా బెదిరించారు. అసభ్య పదజాలంతో బూతులు తిడుతూ పాత్రికేయుల విధులకు ఆటంకం కలిగించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా బియ్యం తరలిస్తున్న వారిపై, అందుకు సహకరిస్తున్న రేషన్ డీలర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేని పక్షంలో అర్హులైన పేదలకు తీరని అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# గంజాయి సేవిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

**మెడికల్ టెస్టుల్లో గంజాయి తాగినట్లు నిర్ధారణ**

**యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై హెచ్చరిక**



**భీమారం, ఏప్రిల్ 9 (జనం పవర్):** మంచిర్యాల జిల్లా భీమారం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పొల్లవేని రాజేందర్, ఆలం మధుకర్ అనే వ్యక్తులు కొంతకాలంగా గంజాయికి అలవాటు పడి స్నేహితులతో కలిసి సేవిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. మెడికల్ ఆఫీసర్ సమక్షంలో ప్రత్యేక పరీక్షా కిట్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో గంజాయి తాగినట్లు పాజిటివ్ రిపోర్ట్ రావడంతో వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం సెక్షన్ 27(బి) ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

**తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి**

మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువకులు తమ ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. అవసరమైతే వారిని డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలిస్తామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించి చెడు వ్యసనాలకు దూరంగా ఉంచాలని కోరారు. గంజాయి విక్రయాలు లేదా సేవిస్తున్న వారి గురించి సమాచారం తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కూలీల ఆరోగ్యంపై టీజీఎఫ్‌డీసీ శ్రద్ధ

**ప్లాంటేషన్లలో వలస కూలీలకు వైద్య శిబిరం**

**మందులు, మజ్జిగ పంపిణీ చేసిన అధికారులు**



**మంచిర్యాల, ఏప్రిల్ 9 (జనం పవర్):** తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నీలగిరి ప్లాంటేషన్లలో పనిచేసే వలస కూలీల ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్ తెలిపారు. కోటపల్లి మండలం బావన్ పల్లి సమీపంలోని ప్లాంటేషన్‌లో గురువారం వలస కూలీలకు వైద్య శిబిరం నిర్వహించారు. కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో జరిగిన ఈ కార్యక్రమానికి కూలీల నుంచి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో కూలీలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎండల దృష్ట్యా అందరికీ మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, హెల్త్ సూపర్ వైజర్ ఇందిర, సీహెచ్‌ఓ రమ్య పాల్గొన్నారు. ఎంపీహెచ్‌ఏ సంధ్యారాణి, తిరుపతమ్మ, సుధాకర్, ఖలీల్ తో పాటు ఆశా కార్యకర్తలు భారతి, మల్లేశ్వరి, పుష్ప హాజరయ్యారు. టీజీ ఎఫ్ డీసీ సిబ్బంది శ్రీనివాస్, రాజేష్, లచ్చన్న, ఓదెలు, సంజీవ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.





# రామారావుపేటలో పోలీసుల నిర్బంధ తనిఖీలు

- పత్రాలు లేని 69 వాహనాలు సీజ్
- ప్రజలకు నేరాల నివారణపై అవగాహన

**జైపూర్, ఏప్రిల్ 9 (జనం పవర్):** ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు జైపూర్ సీఐ నవీన్, ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో రామారావుపేట గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గ్రామ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి భద్రతపై అవగాహన కల్పించారు. ఆస్తి సంబంధిత నేరాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ఆన్‌లైన్ లావాదేవీల్లో మెళకువలు పాటించాలని సూచించారు.

**వాహనాల స్వాధీనం - హెచ్చరిక**

ఈ తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని 66 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు తప్పనిసరిగా చట్టబద్ధమైన పత్రాలు వెంట ఉంచుకోవాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల రక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని, పోలీసులకు సహకరించి సమాజంలో శాంతి భద్రతలను కాపాడాలని అధికారులు కోరారు.

# సింగరేణిలో జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ల సన్మానం

- అంతర్గత పరీక్షల్లో ముగ్గురు కెమిస్టుల ప్రతిభ
- పట్టుదలతో ఉన్నత పదవులు సాధించవచ్చన్న ప్రధాన మేనేజర్




**జైపూర్, ఏప్రిల్ 9 (జనం పవర్):** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపల్లిలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం పరిపాలన భవనంలో పదోన్నతి పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. సింగరేణి సంస్థ నిర్వహించిన అంతర్గత పరీక్షలలో జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్లుగా ఎంపికైన అజ్మీర మోహన్, సంఘం శివశంకర్, గాదె శ్రీనివాస్ లను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రధాన మేనేజర్ ఎం. నరసింహారావు మాట్లాడుతూ.. కృషి, క్రమశిక్షణ, అంకితభావం ఉంటే ఎవరైనా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. ప్రతిభ కనబరిచిన ముగ్గురు అధికారులకు ఆఫీస్ ఆర్డర్లను అందజేసి శాలువాలతో ఘనంగా గౌరవించారు. ఈ వేడుకలో అధికారులు మదన్ మోహన్, కిరణ్ బాబు, సంతోష్ కుమార్, సుబ్బారావు పాల్గొన్నారు. కార్మిక సంఘం కార్యదర్శి సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు పంతులా సహా పలువురు ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉన్నత ఉద్యోగాలు సాధించిన వారిని తోటి సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారు సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

# డాక్టర్ ఇంట్లో దోపిడీ.. తొమ్మిది మంది అరెస్ట్

- 72 గంటల్లో కేసు ఛేదించిన సిద్దిపేట పోలీసులు
- నిందితుల నుంచి 20 లక్షల ఆస్తి స్వాధీనం



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేటలో సంచలనం సృష్టించిన డాక్టర్ ఇంట్లో జరిగిన దోపిడీ కేసును పోలీసులు కేవలం 72 గంటల్లోనే ఛేదించారు. ఈ కేసులో 9 మంది నిందితులను అరెస్ట్ చేసి సుమారు 20 లక్షల రూపాయల విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ వెల్లడించారు. ఏప్రిల్ 4వ తేదీ రాత్రి బురుగుపల్లిలోని 'చెర్విత్రా మెడోస్'లో గుర్తుతెలియని దుండగులు డాక్టర్ ఇంట్లోకి చొరబడి కత్తులతో బెదిరించి నగదు, బంగారం దోచుకెళ్లినట్లు తెలిపారు.

**మాస్టర్ మైండ్ రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి**

ఈ దోపిడీకి బెల్లంపల్లికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి శ్రీకాంత్ క్రాంతి మాస్టర్ మైండ్‌గా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు ముందుగా రెక్కీ నిర్వహించి పథకం ప్రకారం ప్రహరీ గోడ దూకి లోపలికి ప్రవేశించారు. మహిళలు, పిల్లలను తాళ్లతో కట్టివేసి నగదు, ఆభరణాలు దోచుకున్నారు. నిందితుల నుంచి బంగారం, బైక్, కారు, పది మొబైల్ ఫోన్లతో పాటు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**సిబ్బందికి అభినందనలు**

కేసును వేగంగా ఛేదించిన ఏసీపీ రవీందర్ రెడ్డి, సీఐ శ్రీను, ఇతర సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానితులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అప్రమత్తంగా ఉండటం ద్వారా నేరాలను అరికట్టవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# డిగ్రీ కళాశాల జాబ్ మేళాకు స్పందన

- 31 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు
- ముత్తూట్ ఫైనాన్స్, విజయ బయో ఫార్మాలో కొలువులు



**జుక్కల్, ఏప్రిల్ 9 (జనం పవర్):** బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ముత్తూట్ ఫైనాన్స్ హెచ్‌ఆర్ మేనేజర్ బాలకృష్ణ, విజయ బయో ఫార్మా ప్రతినిధి నరేష్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన వారికి తక్షణమే ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ కె. అశోక్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సరైన అవకాశాలు, మార్గదర్శకత్వం అవసరమని పేర్కొన్నారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా సంస్థల ప్రతినిధులతో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ టి. అశోక్ రావు మాట్లాడుతూ మొత్తం 130 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 31 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి. రమేష్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోతిరెడ్డిపల్లిలో అక్రమ మద్యం దందా

- నిబంధనలు తుంగలో తొక్కి అర్ధరాత్రి వరకు విక్రయాలు
- శాంతిభద్రతలకు భంగం కలుగుతోందని స్థానికుల ఆందోళన



**సంగారెడ్డి, ఏప్రిల్ 10 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి చౌరస్తా ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. అనుమతించిన సమయం ముగిసిన తర్వాత కూడా రాత్రి 10 గంటల తర్వాత బహిరంగంగా అమ్మకాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ విక్రయాల వల్ల ప్రాంతంలో శాంతిభద్రతలకు భంగం కలుగుతోంది. రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం పెరగడంతో నివాసితులు భయాందోళనకు గురవుతున్నారు. ఎక్సైజ్ శాఖ, పోలీసు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ విక్రయాలపై తక్షణమే దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వివాహ సాయం

- గందె శ్రీనివాస్ పుట్టినరోజున బియ్యం పంపిణీ
- క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయమన్న నేతి వేణుకుమార్

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గందె శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. వారి ఆర్థిక సహాయంతో తొగుట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన దామరమైన రాజుఉస్వరూప దంపతుల కుమార్తె శైలజ వివాహానికి సహాయంగా అమ్మాయి తాత కిష్టయ్యకు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.

## సేవకు అండగా..

ఈ సందర్భంగా వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ నేతి వేణుకుమార్ మాట్లాడుతూ క్లబ్ సభ్యుల సహకారంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వివాహ సహాయం మాత్రమే కాకుండా పేద మహిళల జీవనోపాధి కోసం కుట్టుమిషన్లు అందించడం వంటి పలు కార్యక్రమాలు కూడా చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు కూర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నాగమల్ల కిషన్, గ్రీటింగ్స్ చైర్మన్ మర్యాల వీరేశం, కాసనగోట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# పేద వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దు

- మున్సిపల్ అధికారులకు జగ్గారెడ్డి కీలక సూచనలు
- మానవత్వంతో వ్యవహరించి ఉపాధి కాపాడాలని ఆదేశం

**సంగారెడ్డి, ఏప్రిల్ 9 (జనం పవర్):** సంగారెడ్డి పట్టణంలో రోడ్డు పక్కన చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదల పట్ల సహానుభూతితో వ్యవహరించాలని మున్సిపల్ చైర్మన్ జగ్గారెడ్డి సూచించారు. ఈ మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, పోలీస్ అధికారులకు ఆయన స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

## ఉపాధిని దెబ్బతీయవద్దు

రోడ్ల పక్కన ఉన్న డబ్బాలు, పండ్ల బండ్లు, తోపుడు బండ్లు, పాన్ డబ్బాలు, పానీపూరి బండ్లు, ఫాస్ట్ ఫుడ్ స్టాళ్లు, పువ్వుల బండ్లపై ఆధారపడి జీవిస్తున్న పేద ప్రజలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. వారి ఉపాధిని దెబ్బతీయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.

## ముందస్తు అనుమతి తప్పనిసరి

అత్యవసర పరిస్థితుల్లో వారిపై చర్యలు తీసుకోవాల్సి వచ్చినా ముందుగా తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. తన అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే వెళ్లాలని స్పష్టం చేశారు. పేదల జీవనోపాధిని కాపాడటం అందరి బాధ్యత అని, మానవత్వంతో వ్యవహరించడం వల్ల సమాజంలో నమ్మకం పెరుగుతుందని జగ్గారెడ్డి పేర్కొన్నారు.



# ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

- ఆరోగ్య వారం సందర్భంగా భారీ అవగాహన ర్యాలీ
- 2030 నాటికి వ్యాధిని నిర్మూలిద్దామన్న డాక్టర్ ధనరాజు

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారం సందర్భంగా ఎయిడ్స్ వ్యాధిపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజు ఆధ్వర్యంలో మోడ్రన్ బస్టాండ్ వద్ద అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌక్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు.




## నివారణ చర్యలే మార్గం

సదస్సులో డాక్టర్ ధనరాజు మాట్లాడుతూ 2030 నాటికి ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ వినోద్ బాబ్జి మాట్లాడుతూ సురక్షిత ఆచరణలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల బాధితులకు అందుతున్న ఏఆర్టి చికిత్స గురించి వివరించారు.

## విద్యార్థులకు క్విజ్ పోటీలు

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ విజయకుమారి నివారణలో అందరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని సూచించారు. విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు లక్ష్మీనాచారి, సత్యనారాయణ, రాజేందర్, వెంకటరమణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.







# పాపయ్యపల్లిలో పౌష్టికాహారం పంపిణీ

**గర్భిణులు, బాలింతలకు బాలామృతం, గుడ్ల అందజేత**

**ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్న సర్పంచ్ బొల్లం శ్రీధర్**



**బెజ్జంకి, ఏప్రిల్ 9 (జనం పవర్):** బెజ్జంకి గ్రామపంచాయతీ పరిధిలోని పాపయ్యపల్లి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, బాలామృతం, గుడ్లను సర్పంచ్ బొల్లం శ్రీధర్ గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించే ఈ ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్య ఫలితాలు ఉంటాయని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## ఆరోగ్య నియమాలు పాటించాలి

పిల్లల బరువు, ఎత్తు పెరగడంతో పాటు వారు దృఢంగా ఉండాలంటే ప్రభుత్వం ఇచ్చే బలవర్ధకమైన ఆహారాన్ని తప్పకుండా వాడాలని సర్పంచ్ సూచించారు. ఎప్పటికప్పుడు పిల్లల ఎదుగుదలను పరీక్షించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధూమాల మహేష్, అంగన్వాడీ టీచర్, వార్డు సభ్యులు తిప్పారపు మహేష్, లోనే నర్సింగం, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రణయ్ రాజ్ జ్ఞాపకార్థం విద్యా సామాగ్రి పంపిణీ

**రెండవ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు అండ**

**రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన సోదరుడు వినయ్**



**దండేపల్లి, ఏప్రిల్ 9 (జనం పవర్):** దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన జిల్లపెల్లి ప్రణయ్ రాజ్ రెండో వర్ధంతిని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అకాల మరణం చెందిన తన అన్న జ్ఞాపకార్థం సోదరుడు వినయ్ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఈ విద్యా సామాగ్రిని అందజేశారు.

## హెల్మెట్ ధరించడం తప్పనిసరి

ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వినయ్ కోరారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోయి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సురక్షిత ప్రయాణంపై అందరిలో అవగాహన పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, ఉపాధ్యాయులు రామరాజు, శ్రీనివాస్, మీనాక్షి, గ్రామ యువత అంజి, గణేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

**పాపయ్యపల్లిలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభం**

**బీపీ, షుగర్ పరీక్షలు.. ఉచిత మందుల పంపిణీ**



**బెజ్జంకి, ఏప్రిల్ 9 (జనం పవర్):** ప్రతి వ్యక్తి ఆరోగ్య పరీక్షలు చేయించుకొని ప్రశాంతంగా జీవించాలని బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్ (పెద్దన్న) స్పష్టం చేశారు. గురువారం బెజ్జంకి గ్రామపంచాయతీ పరిధిలోని పాపయ్యపల్లి గ్రామంలో బెజ్జంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు.

## అనారోగ్య రహిత రాష్ట్రం

ప్రభుత్వం నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాల్లో ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ కోరారు. అనారోగ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మాధురి, ఉప సర్పంచ్ ధూమాల మహేష్ పాల్గొన్నారు. వార్డు సభ్యులు తిప్పారపు మహేష్, లోనే నర్సింగం, ఏఎన్ఎం అనిత, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్ తో పాటు గ్రామస్తులు ఈ శిబిరంలో పాల్గొన్నారు.

# వరిధాన్యానికి రూ.500 బోనస్

**రైతులకు కొండంత అండగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన గజానన్ దేశాయ్**



**జుక్కల్, ఏప్రిల్ 9 (జనం పవర్):** రైతు సంక్షేమానికి కట్టుబడి ఇచ్చిన మాట ప్రకారం వరిధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మండల అధ్యక్షుడు గజానన్ దేశాయ్ తెలిపారు. గురువారం కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని ఎనబోరా, మాదన్ ఇప్పర్గా, దోతి గ్రామాల్లో ఐకేపీ గ్రామ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని గజానన్ దేశాయ్ పేర్కొన్నారు. రైతు పండించిన ప్రతి గింజకు గౌరవం ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశాల మేరకు వరి ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తూ కేంద్రాలు ప్రారంభించినట్లు చెప్పారు. గ్రేడ్-ఏ రకానికి 2389 రూపాయలు, సాధారణ రకానికి 2369 రూపాయల ధరతో పాటు అదనంగా 500 రూపాయల బోనస్ ఇస్తుండటం రైతు ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తుందన్నారు.

## పారదర్శకమైన కొనుగోలు ప్రక్రియ

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ ఉద్దేశమని, రైతు చిరునవ్వే తమ విజయమని ఆయన వివరించారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు యూనుస్ పటేల్, ఐకేపీ ఏపీఎం జగదీష్ కుమార్, సర్పంచులు లక్ష్మణ్, సంగం పటేల్, కాంగ్రెస్ నాయకులు, ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# భవన కార్మికులకు కాంగ్రెస్ భరోసా

**కార్మిక సంఘాల నేతలతో పూజల హరికృష్ణ భేటీ**

**సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణను 14 భవన కార్మిక సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా భవన కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీశైలం నేతృత్వంలో వచ్చిన నాయకులు భవన కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

## మంత్రి దృష్టికి సమస్యలు

కార్మికుల సమస్యలను శ్రద్ధగా విన్న పూజల హరికృష్ణ వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమస్యలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. త్వరలోనే మంత్రితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు.

## కార్మిక సంక్షేమమే లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ భవన కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని మరోసారి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి, కలీముద్దిన్ అహ్మద్, బిక్షపతి, ముద్దం లక్ష్మి, అంబటి మహేష్, కృష్ణమూర్తి, ఏరాబోలు రాజిరెడ్డి పాల్గొన్నారు.









# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- **నిర్మల జగ్గారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం**
- **లబ్ధిదారులకు కుట్టు మిషన్ల పంపిణీ.. బ్యూటీషియన్ శిక్షణ ప్రారంభం**

**సంగారెడ్డి, ఏప్రిల్ 9 (జనం పవర్):** సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకం. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఈ క్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో - బేటి పడావో పథకం కింద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

## ఉపాధి శిక్షణ తరగతులు

ఈ కార్యక్రమంలో భాగంగా 50 మంది లబ్ధిదారులకు కుట్టు యంత్రాలను పంపిణీ చేశారు. 25 మంది మహిళలకు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. వీటి ద్వారా మహిళలు స్వయంగా ఉపాధి సంపాదించి కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పడగలుగుతారు. ఆర్థికంగా వెనుకబడిన వారు, ఒంటరి మహిళలు, వితంతువులు, చదువు మధ్యలో మానేసిన వారికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతోంది.

## అభ్యున్నతికి అండగా

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళల అభ్యున్నతికి ఇలాంటి చర్యలు ఎంతో అవసరమని, వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలు మహిళల జీవనోపాధిని మెరుగుపరుస్తాయని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సంకేతంగా ఈ సందర్భంగా మొక్కలు నాటారు.

# పూలే విగ్రహ ప్రతిష్ఠకు స్థలం కేటాయించాలి

- **మేయర్‌కు వినతిపత్రం అందజేసిన బీసీ సమాజ్ నాయకులు**
- **మహనీయుల చరిత్ర భావితరాలకు తెలియాలన్న నరెడ్ల శ్రీనివాస్**



**మంచిర్యాల, ఏప్రిల్ 9 (జనం పవర్):** మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో మహాత్మ జ్యోతిరావు పూలే సహా బీసీ మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు తగిన స్థలం కేటాయించాలని బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మంచిర్యాల మేయర్‌కు వినతిపత్రం అందజేశారు. సామాజిక అసమానతలపై పోరాడి అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి పూలే ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా కొనియాడారు.

## అణగారిన వర్గాల కోసం పోరాటం

అజ్ఞానమే అన్ని అనర్థాలకు మూలమని భావించి వెనుకబడిన వర్గాల బాలికల కోసం బడులు స్థాపించిన జ్ఞానజ్యోతి పూలే అని శ్రీనివాస్ పేర్కొన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించి స్త్రీ స్వేచ్ఛ కోసం ఆయన నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. తన భార్య సావిత్రిబాయి పూలేకు విద్యాబుద్ధులు నేర్పించి ఆమె ద్వారా బాలికా విద్యకు ఆనాడే పునాదులు వేశారన్నారు. అటువంటి గొప్ప మహనీయుని గురించి నేటి తరానికి తెలియకపోవడం దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

## పట్టణ నడిబొడ్డున విగ్రహం

పట్టణ నడిబొడ్డున విగ్రహం ప్రతిష్ఠించినప్పుడే భావితరాలకు ఆయన చేసిన కృషి తెలుస్తుందని శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. గత కొన్నేళ్లుగా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వెంటనే స్థలాన్ని మంజూరు చేసి మహనీయుల జయంతి, వర్ధంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని మేయర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ నాయకులు రవీందర్, సదానందం, రాజేశం, షఫీ, అంజన్న, మహేష్, శీను, వినోద్ కుమార్ పాల్గొన్నారు.





# స్మశాన వాటిక భూమి అక్రమణపై ఫిర్యాదు

- **కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసిన మిలిగిరిపేట గ్రామస్థులు**
- **పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**సంగారెడ్డి, ఏప్రిల్ 9 (జనం పవర్):** సదాశివపేట మండలం మిలిగిరిపేట గ్రామంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై గ్రామస్థులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 108లో ఉన్న మూడు గుంటల స్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించి రేకుల షెడ్డు, ప్రహరీ గోడ నిర్మించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సర్వే నంబర్ 109లోని ఎస్సీ కాలనీకి చెందిన ఖాళీ స్థలంలో అక్రమంగా కడీలు పాతడమే కాకుండా మొరం వేశారని కలెక్టరేట్ లో వినతిపత్రం అందజేశారు. ఈ అక్రమ ఆక్రమణలపై గతంలోనే గ్రామ కార్యదర్శి, మండల పంచాయతీ అధికారి, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని గ్రామస్థులు మ్యాతరి ప్రేమల ఆరోపించారు. స్థానిక అధికారులు ఆక్రమణదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే స్పందించి స్మశాన వాటికలోని షెడ్డును, ఎస్సీ కాలనీ స్థలంలోని కడీలను తొలగించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు శ్రీధర్, మహేంద్ర పాల్గొన్నారు.





